ఆంధ్రప్రభ
Estd. 1938
www.prabhanews.com Journalism first!

# మెట్రోతో పాతనగరం దశ మారబోతోంది




సమావేశంలో పాల్గొన్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, అధికారులు ఎన్వీఎస్ రెడ్డి, కలెక్టర్



చెక్కుల పంపిణీ చేస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, అధికారులు ఎన్వీఎస్ రెడ్డి, కలెక్టర్

- ప్రభావిత ఆస్తుల యజమానులకు చెక్కుల పంపిణీ
- హెచ్ఎఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి
- మొత్తం 41మంది యజమానులకు రూ. 20కోట్ల నష్టపరిహారం చెల్లింపు
- మెట్రో నిర్మాణానికి సహకరిస్తాం: ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రప్రభ): హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు కీలకమైన అడుగులు పడ్డాయి. ఎంజీబీఎస్ - చంద్రాయణగుట్ట మార్గంలో ప్రభావిత 34 ఆస్తులకు సంబంధించిన 41మంది యజమానులకు రూ. 20కోట్ల నష్టపరిహారాన్ని ప్రభుత్వం సోమవారం చెల్లించింది. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, హెచ్ఎఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. పాతనగరంలో మెట్రోరైల్ నిర్మాణం కోసం ఆస్తులు కోల్పోయిన వారికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సముచితమైన రీతిలో నష్టపరిహారాన్ని చెల్లిస్తున్నామని, ఈప్రక్రియలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సూచనలను పరిగణలోకి తీసుకున్నామని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. మొదటి దశ కన్నా మరిన్ని సౌకర్యాలతో రెండో దశ నిర్మాణం చేపట్టనున్నామని, దీనిలో పాతనగరం రూపురేఖలు మరనున్నాయన్నారు. ఎంపీ సూచనల మేరకు మెట్రోస్టేషన్ల నుండి చార్మినార్, లాడ్‌బజార్, సాలార్ జంగ్ మ్యూజియం వంటి పర్యాటక ప్రాంతాలకు స్కైవాక్, ఫుట్‌పాత్ మొదలైన అధునాతన సౌకర్యాలు సమకూరుస్తామని తెలిపారు. పాతనగరం ఇంకా అభివృద్ధి జరగాలని సీఎం ఆకాంక్షనని, అందుకు తగ్గట్లుగా మెట్రోను పాత నగరవాసులకు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు.

**మెట్రో స్టేషన్ల వద్ద వ్యాపారాలు పెట్టుకోడానికి తగు ప్రాధాన్యత ఇవ్వాలి : ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ**

మొత్తం రూ. 2,741కోట్ల అంచనా వ్యయంతో ఏడున్నర కిలోమీటర్ల పాతనగరం మెట్రోను నాలుగేళ్లలో పూర్తిచేయాలన్న సీఎం సంకల్పాన్ని నెరవేర్చడానికి సన్నద్ధమయ్యామని ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. నాంపల్లిలో అధునాతన మల్టీలెవెల్ పార్కింగ్ ప్రాజెక్టు కూడా వచ్చేనెలలో ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని, ఇదికూడా పాతనగర అభివృద్ధికి ముఖద్వారం అవుతుందని ఆయన వెల్లడించారు. ఎంపీ ఒవైసీ మాట్లాడుతూ.. ఎంతో కాలంగా ఓల్డ్‌సిటీవాసులు ఎదురుచూస్తున్న మెట్రోరైల్ ఇప్పుడు ఆచరణలోకి రావడం ప్రశంసనీయమని, ఇందుకు సీఎంకి కృతజ్ఞతలన్నారు. మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి చేస్తున్న కృషికి తాము సహకరిస్తామని స్పష్టంచేశారు. ప్రతిపాదిత మీరాలంమండీ, చార్మినార్ స్టేషన్ల వద్ద స్కైవాక్‌లను నిర్మిస్తే పర్యాటక పరంగానే కాకుండా స్థానికులకు కూడా సౌలభ్యంగా ఉంటుందని ఆయన సూచించారు. నిర్వాసితులకు, రాబోయే మెట్రోస్టేషన్ల వద్ద వ్యాపారాలు పెట్టుకోడానికి తగు ప్రాధాన్యత ఇవ్వవలసిందిగా మెట్రో ఎండీకి ఒవైసీ విజ్ఞప్తిచేశారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. మెట్రో రైల్ ప్రాజెక్టు కోసం ముందుకు వచ్చిన నిర్వాసితులకు లాభదాయకమైన నష్టపరిహారాన్ని నిర్ణయించామని, దీన్ని అందరూ ఆహ్వానించారన్నారు. మొత్తం 1100 ఆస్తులకు సుమారు రూ. వెయ్యి కోట్ల నష్టపరిహారం చెల్లించనున్నామని, ఇందుకు స్థానికులు తమకు పూర్తిగా సహకరిస్తున్నారని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఈకార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.